క్లుప్తంగా

ఒత్తిడిని జయిస్తేనే అదుపులో రక్తపోటు


సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: మానసిక ఒత్తిడిని జయిస్తూ ఆహారపు నియమాలను పాటించినట్‌లైతే రక్తపోటు, షుగర్ అదుపులో ఉంటాయని సత్తుపల్లి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోష్ణ అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో నర్సింగ్ కళాశాల ఆధ్వర్యాన బీపీ, షుగర్ పరీక్షల శిబిరాన్ని నిర్వహించి రోగులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును సత్కరించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఉషా, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

'కల్యాణమస్తు' గోల్డ్ కాయిన్ అందజేత


వధూవరులకు గోల్డ్ కాయిన్ అందజేస్తున్న దృశ్యం

తల్లాడ: మండలంలోని కలకొడిమ సంఘంలో పాలు పోస్తున్న షేక్ పులుసాహెబ్ కుమారుడు సలీమ్‌కు మంగళవారం కృష్ణా మిల్క్ ఆధ్వర్యంలో రూ.20 వేలు వలువైన గోల్డ్ కాయిన్ అందజేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రవేశపెట్టిన కల్యాణమస్తు పథకం ద్వారా గోల్డ్ కాయిన్‌ను తిరువూరు క్లస్టర్ మేనేజర్ టి.సాంబశివమూర్తి, సంఘ అధ్యక్షుడు ఐతంరాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పాలక వర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలు పొందాలి

మధిర: అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను పొందాలని మధిర ఎంపీడీఓ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకొని జీరో విద్యుత్ బిల్లులు రానివారు, గ్యాస్ రాయితీ రానివారు ఆధార్, రేషన్ కార్డు, కరెంట్ బిల్లు, గ్యాస్ బుక్, ప్రజాబలన దరఖాస్తుల జిరాక్స్‌లను తీసుకొని మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పనిదినాల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంప్రదించి అర్హులైన వారు లబ్ధి పొందాలని కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


బస్వాపురంలో టాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిన విద్యుత్ అధికారులు

చింతకాని: మండలంలోని బస్వాపురం గ్రామంలో సింగిల్ ఫేజ్ 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెద్దగోపతి ఏడీఏ తిలక్ మాట్లాడుతూ.. గ్రామప్రజలు ఇబ్బందుల దృష్ట్యా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతకాని సబ్‌స్టేషన్ ఏఈ వెంకన్న, గ్రామపెద్దలు గోపి, మోహన్‌రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాహనాన్ని అడ్డుకున్న యువకులు

కారేపల్లి: ఆవు మాంసం తరలిస్తున్నారనే సమాచారంతో కొందరు యువకులు వాహనాన్ని అడ్డుకున్నారు. మండలంలోని గాదెపాడులో కొందరు మంగళవారం ఆవులను వధించి మాంసాన్ని వాహనంలో ఖమ్మం తీసుకెలుతున్నారని తెలియడంతో యువకులు వాహనాన్ని కారేపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. కాగా, పశువైద్యులు పరీక్షించి అది ఆవు మాంసం కాదని, ఎద్దు మాంసమని నిర్ధారించటంతో వాహనాన్ని వదిలేసినట్లు తెలిసింది.

రేపు ఉపాధిహామీ 'ప్రజా వేదిక'

వైరారూరల్: ఈ నెల 20న వైరా మండల ఉపాధిహామీ 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా కార్యక్రమాన్ని వైరా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సర్వసతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధిహామీ తనిఖీ బృందం 22 పంచాయతీల్లో ఈ నెల 12 నుంచి 19 వరకు చేపట్టిన సామాజిక తనిఖీలను ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 10గంటలకు నిర్వహించే ఉపాధిహామీ ప్రజావేదిక కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

గడువు దాటితే వడ్డీ పడుద్ది..

- ముున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను నోటీసులు జారీ
- ఈ నెలాఖరుతో ముగియనున్న గడువు


సత్తుపల్లిలో ఆస్తిపన్ను నోటీసులు జారీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది


సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయం

సత్తుపల్లిటౌన్: ఆస్తిపన్ను చెల్లించేందుకు మున్సిపాలిటీల్లో ప్రతి ఇంటికి డిమాండ్ నోటీసులు పంపిణీ చేపట్టారు. నెలాఖరుకు గడువు ముగుస్తుండగా.. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు చెల్లిస్తామంటే మాత్రం వడ్డీ భారం పడుతుంది. జిల్లాలోని సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్లకు 2024–25 ఆర్థిక సంవత్సరంలోని అర్ధ సంవత్సరం డిమాండ్ నోటీసులు జారీ చేస్తూ.. ఆస్తిపన్ను వసూళ్ల చేయటంలో మున్సిపల్ సిబ్బంది నిమగ్నమయ్యారు.

పన్నులతోనే అభివృద్ధి, వేతనాలు..

ఆస్తిపన్నులు వసూళ్ల అయిన మొత్తంతోనే పట్టణాభివృద్ధి పనులు, సిబ్బంది వేతనాల చెల్లింపులకు వినియోగిస్తారు. ఈ నిధులను సమకూర్చుకోవటానికి మున్సిపల్ రెవెన్యూ యంత్రాంగం పట్టణంలోని భవనాలకు సంబంధించిన పన్నులు వసూళ్ల చేసుకోవడానికి ఇంటి పన్నులు వసూలు చేపడతారు. దీని ఆధారంగానే ఏటా ఆర్థిక సంవత్సరం ముగింపులోగా పన్నులు వసూళ్ల చేసుకోవడానికి డిమాండ్ నోటీసులు జారీ చేస్తారు.

రెండు విడతలుగా..

2024–25 ఆర్థిక సంవత్సరం మార్చిలో ముగుస్తుండగా.. పన్ను చెల్లించటానికి రెండు విడతలుగా విధించి పన్ను రాబట్టుకుంటున్నారు. మొదటి అర్ధ వార్షిక సంవత్సరం జూన్ నెలాఖరు వరకు, రెండో అర్ధ వార్షిక సంవత్సరం డిసెంబర్ నెలాఖరు వరకు పరిగణలోకి తీసుకుంటారు.

ఇంటింటికీ తిరుగుతూ..

మున్సిపల్ సిబ్బంది పట్టణాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఆస్తి పన్ను చెల్లించాలని ఇంటి యజమానులకు నోటీసులు పంపిణీ చేస్తున్నారు. గత 20 రోజులుగా బిల్‌కలెక్టర్లు ఈ నోటీసులు అందిస్తున్నారు. అయితే వచ్చే ఏడాది మార్చి వరకు ఎర్లీబర్డ్ పథకంలో 5శాతం రాయితీతో ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి ఈ నోటీసులు పంపిణీ చేయరు. సత్తుపల్లి మున్సిపాలిటీలో ఎర్లీబర్డ్ పథకం కింద రూ. 1.20 కోట్ల పన్నులు వసూళ్ల అయ్యాయి. ఈ పథకం ఏప్రిల్ 30వ తేదీతో ముగిసింది.

వచ్చే నెల నుంచి 2శాతం వడ్డీ..

మొదటి అర్ధ వార్షిక సంవత్సరం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ లోగా పన్ను చెల్లిస్తే వడ్డీభారం ఉండదు. లేదంటే వచ్చే నెల ప్రారంభం నుంచి ఆస్తి పన్నుపై 2శాతం వడ్డీ పడుతుంది. ఇలా ప్రతి నెల వడ్డీ పెరుగుతుంది. నోటీసు అందినా.. అందకపోయినా ఇంటి నంబర్, అసెస్‌మెంట్ నంబర్ ఆధారంగా కార్యాలయాల్లో బిల్‌కలెక్టర్ల వద్ద చెల్లించే వీలు ఉంది. ఈ నెల 30లోగా చెల్లిస్తే ఎలాంటి వడ్డీ ఉండదు.

మున్సిపాలిటీ	అసెస్‌మెంట్లు	డిమాండ్
సత్తుపల్లి	9709	రూ.4.62 కోట్లు
వైరా	7040	రూ. 3.60 కోట్లు
మధిర	8642	రూ. 2.33 కోట్లు

నోటీసులు జారీ చేశాం..



మున్సిపాలిటీలో డిమాండ్‌లో ఉన్న ప్రతి ఇంటికి ట్యాక్స్ నోటీసులు జారీ చేశాం. జూన్ 30లోగా ఆస్తిపన్ను చెల్లిస్తే వడ్డీ లేకుండా చెల్లించవచ్చు. లేనట్లయితే నెలనెల 2శాతం చొప్పున వడ్డీ పడుతుంది. ప్రజలు ఆస్తి పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి.

– మందా రవిబాబు, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

రాబోయే ఎన్నికల్లోనూ అండగా నిలవండి


సత్తుపల్లిలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: ఇప్పటివరకు జరిగిన అన్ని ఎన్నికల్లో ఆదరించిన ప్రజలు.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కి అండగా నిలవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి కోరారు. మంగళవారం సత్తుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మండలంలోని 96 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా పాలన సాగిస్తూ ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ యోగీశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, ఆర్ఐలు నరేష్, జానీమియా, కౌన్సిలర్లు మౌలాలీ, నాగుల్‌మీరా, కంటే నాగలక్ష్మి, సలీమాఖాతూన్‌తో పాటు చల్లారి వెంకటేశ్వరరావు, చల్లగుళ్ల నర్సింహారావు, ఉడతనేని అప్పారావు, ఎం.డీ.కమల్‌పాషా, గాదె చెన్నారావు, నారాయణవరపు శ్రీనివాస్, మందపాటి ముత్తారెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు..

తల్లాడ/కల్లూరురూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి వెల్లడించారు. తల్లాడ, కల్లూరులో మంగళవారం జరిగిన సమావేశాల్లో ఆమె 77మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ఇప్పటికే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల్లో ఐదు అమలు చేస్తున్నామని, త్వరలోనే రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ అమలవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్లు రవికుమార్, పులి సాంబశివరావు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్ఐలు కొండల్‌రావు, ఎస్.కే.షాకీర్, ఆర్ఐలు అన్వర్, స్టాలిన్, కాంగ్రెస్ నాయకులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, పొట్టేటి జనార్దన్‌రెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, వేమిరెడ్డి తులిశమ్మ, అన్నెం కోటిరెడ్డి, డి.వీరారెడ్డి, కటికి కిరణ్, అనుముల కృష్ణ, దగ్గుల నాగిరెడ్డి, తుమ్మలపల్లి రమేష్, లచ్చిరెడ్డి, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తోటకూర శేషగిరిరావు, అన్నంరాజు, ఏనుగు సత్యంబాబు, భాగం ప్రభాకర్‌చౌదరి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

కల్లూరు: కల్లూరు పట్టణానికి చెందిన కోఆపరేటివ్ బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి గంగుల పుల్లయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే హైదరాబాద్‌లో చికిత్స పొంది కల్లూరు వచ్చారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆ గృహాన్ని సందర్శించి బాధితుడిని పరామర్శించి.. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కాంగ్రెస్ నాయకుడు చందర్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు లక్కినేని రఘులు పరామర్శించారు. కార్యక్రమంలో ప్రభాకర్ చౌదరి, సత్యం బాబు, నగేష్, శ్రీను, శివకుమార్ నాయక్, కిషోర్ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ గోసు మధు

కొణిజర్ల: ప్రతీ మూడునెలలకోసారి గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పతకాలు, మొదలగు అంశాలపై నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. మంగళవారం మండల కేంద్రంలో మండల పరిషత్‌లో ఎంపీపీ గోసు మధు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. కొణిజర్ల మండల పరిషత్ ప్రస్తుత ఎంపీటీసీ సభ్యుల చిట్టచివరి సమావేశం. అయినప్పటికీ 15 మంది ఎంపీటీసీ సభ్యులుండగా పది మంది మాత్రమే హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలో చెరువులు ఆక్రమణకు గురి అవుతున్నాయని శిఖం భూములు అనేక గ్రామాల్లో అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తనికెళ్ల ఎంపీటీసీ గుండ్ల కోటేశ్వరరావు లేవనెత్తారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలలో ఉచిత విద్యుత్ పథకం, రూ.500కు గ్యాస్ పథకం అనేక మంది లబ్ధిదారులకు రావడం లేదని సభ్యులు లేవనెత్తడంతో.. స్పందించిన అధికారులు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశామని ఉచిత విద్యుత్ కోసం లబ్ధిదారులు ప్రజాపాలన దరకాస్తు ఫారం, ఆధార్ కార్డు తీసుకుని కార్యాలయంలో పునరుద్ధరించుకోవాలన్నారు. విద్యుత్ బిల్లులకు సంబంధించి ట్రాన్స్‌కో వారికే అప్పగించి ఏ గ్రామానికి అదే గ్రామంలో సరిచేస్తే త్వరిత గతిన సమస్య తీరుతుందని సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రోజారాణి, తహసీల్దార్ తఫజల్ హుస్సేన్, ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముదిగొండ: మండలపరిధిలోని ముదిగొండ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని యడవల్లి, యడవల్లి లక్ష్మీపురం రైతులు, విద్యుత్ వినియోగదారులకు బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ మేకపోతుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. యడవల్లి ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

మువ్వా యూత్ కృషితోనే..


చెన్నూరు హైస్కూల్ ఆవరణలో మొరం తెప్పించిన దృశ్యం

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరులో గల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రావెల్ మొరం పోసి చదును చేశారు. వర్షాకాలంలో హైస్కూల్ ఆవరణ మొత్తం నీటితో నిండి చెరువుని తలపించేది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. దీనిని గమనించిన రాష్ట్ర విద్యా మౌళిక సదుపాయాల సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు, యూత్ సభ్యులు ముందుకు వచ్చి.. పది ట్రాక్టర్ల గ్రావెల్‌ను తెప్పించి హైస్కూల్ ఆవరణను చదును చేశారు. ఈ కార్యక్రమంలో విజయబాబు యూత్ సభ్యులు మన్నే చంటి, ఉపేందర్, తరుణ్, సోని, వినయ్, నర్సింహారావు, బొజ్జ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కల్లూరు: క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి నవ్యకాంత్ అన్నారు. మంగళవారం కల్లూరులోని శాంతినగర్‌లో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో భాగంగా వృద్ధులు, బీపీ, షుగర్ ఉన్న వారికి కళ్లె నమూనాలను సేకరించారు. టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ నోడల్ పర్సన్ గుండపనేని రామారావు, టీబీ చికిత్స సూపర్‌వైజర్ వై.సురేష్ మాట్లాడారు. 2025 నాటికి గ్రామ పంచాయతీలను టీబీ రహిత గ్రామ పంచాయతీలుగా మార్చడమే లక్ష్యంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. రెండు వారాల పైబడి దగ్గు, జ్వరం రావడం, రాత్రి సమయంలో చెమటలు పట్టడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం తదితర లక్షణాలు కనిపిస్తే దగ్గరలోని పీహెచ్‌సీ కేంద్రాల్లో టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ ఆర్.సంజీవ్‌కుమార్, ఏఎన్ఎం రజని, ఆశ కార్యకర్తలు సమాధానం, జమలమ్మ, మైసమ్మ, వసంత తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి స్రవంతి

బోనకల్: అధికారులందరూ ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలని వైద్యాధికారి స్రవంతి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పలు గ్రామాల్లో డయేరియా కేసులు నమోదు అవుతున్నాయని తెలిపారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వాంతులు, విరోచనాలు అయిన వెంటనే వైద్యుల సలహాలు తీసుకోవాలన్నారు. వైద్యసిబ్బంది గ్రామాల్లో ప్రతి ఇంటికి తిరిగి వివరాలు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజు, ఆర్ఐ లక్ష్మణ్ నాయక్, సీహెచ్ఓ శ్రీనివాసరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో అన్నదానాలు


భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని అయ్యగారిపేట శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం, వేంసూరు రోడ్‌లోని శ్రీమెట్టాంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. దివ్వా వెంకటరామారావు, శారద దంపతులు, చింతపల్లి కృష్ణప్రసాద్, లక్ష్మి దంపతులు, బి.ప్రసాద్, బి.ధర్మారావు, వాణి, కొత్తూరు కోటేశ్వరరావు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో నాగళ్ల ప్రసాద్, బొంతు మాధవరావు, కొప్పుల రజిని, మల్లూరు అంకమరాజు, పురుషోత్తం పాల్గొన్నారు.

మార్కెట్ ధర తగ్గించాలి


సబ్ రిజిస్ట్రార్ విజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సత్తుపల్లిటౌన్: వ్యవసాయ భూములకు మార్కెట్ ధర రూ.4 లక్షలు ఉంటే రూ.30 లక్షలుగా ధరణిలో నమోదు కావటంతో రైతులు నానా ఆగచాట్లు పడాల్సి వస్తోంది. క్రయ విక్రయాలతో పాటు వారసత్వంగా మార్చుకోవటానికి కూడా ఇబ్బందులు పడుతున్నామని వేంసూరు మండలం అమ్మపాలెం రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరణి పోర్టల్‌లో అమ్మపాలెం రెవెన్యూ పరిధిలోని సుమారు 15 సర్వే నంబర్ల పరిధిలోని 30 మంది రైతులకు చెందిన 50 ఎకరాలకు ధరణిలో తప్పుగా నమోదు కావటంతో వారు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికై ఎంతో కాలంగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కావటం లేదని రైతులు వాపోతున్నారు. అయితే ప్రభుత్వ భూములకు మార్కెట్‌ధరను నిర్ణయించేందుకు కసరత్తు చేస్తుండటంతో రైతులకు ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రైతులంతా.. సత్తుపల్లి సబ్‌రిజిస్ట్రార్ విజయ్‌ను కలిసి ధరణి పోర్టల్ జరిగిన తప్పిందం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని, వెంటనే సవరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల కాంతారెడ్డి, బెజవాడ వెంకటేశ్వరరావు, జి.సోమయ్య, వీరయ్య, ఎ.నాగేశ్వరరావు, డి.కృష్ణయ్య, కె.వెంకట్రావ్, సత్యవాణి, పద్మ పాల్గొన్నారు.

కొణిజర్ల తహసీల్దార్ బదిలీ

కొణిజర్ల: కొణిజర్ల తహసీల్దార్ తఫజల్ హుస్సేన్ మంగళవారం బదిలీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన వరంగల్ జిల్లా నుంచి కొణిజర్లకు బదిలపై వచ్చారు. ఆయనను ప్రస్తుతం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సూపరెండెంట్‌గా నియమించారు. ఈయన స్థానంలో ఖమ్మం కలెక్టరేట్‌లో సూపరెండెంట్‌గా పనిచేస్తున్న ఆర్.రాంబాబును కొణిజర్ల తహసీల్దార్‌గా నియమించారు. పరిపాలన పరమైన బదిలీలలో భాగంగా ఈ బదిలీ జరిగినట్లు అధికారులు తెలిపారు.

రైతులకు అండగా ఉంటాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఏన్కూరు: సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ కింద భూములు కోల్పోయిన రైతులకు అండగా ఉంటామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని హిమామ్ నగర్‌లో రైతులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రావాల్సిన ప్యాకేజీలో అవకతవకలు లేకుండా ప్రతి రూపాయి.. భూమి కోల్పోయిన రైతులకు అందించేలా కృషి చేస్తానన్నారు. రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. రైతు కుటుంబాల్లో నిరుద్యోగి యువకులకు ప్రైవేట్ పరంగా, ప్రభుత్వ పరంగా ఉద్యోగాలు ఇప్పిస్తామన్నారు. అనంతరం ఏన్కూరు వచ్చి అక్కడ రైతువేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరుగ్యారెంటీలు అమలు చేసిందన్నారు. సీతారామ లింక్ కెనాల్ పనులు పూర్తి చేసి వైరా నియోజవర్గానికి తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, వైస్ ఎంపీపీ పాశం శ్రీనివాసరావు, తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఎంపీడీఓ రమేష్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గప్రసాద్, గుత్త వెంకటేశ్వరావు, స్వర్ణ నరేందర్, మేడ ధర్మారావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, ఈవూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మిషన్ భగీరథ సర్వే


గ్రామాల్లో వివరాలు సేకరిస్తున్న భగీరథ సిబ్బంది

కల్లూరురూరల్: మండలంలోని గ్రామపంచాయతీలలో మిషన్ భగీరథ సర్వే పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి మిషన్ భగీరథకు సంబంధించిన 20 రకాల ప్రశ్నలకు జవాబులు సేకరించి ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మండలంలోని చిన్న పంచాయతీలైన మర్లపాడు, తెలగవరం, లోకవరం, హనుమంతండా, వెన్నవల్లి, ఓబులరావుబంజరు, కిష్టయ్య బంజరు పంచాయతీలలో సర్వే దాదాపు పూర్తి కావచ్చింది. మిగిలిన 23 పంచాయతీల్లో ఈ నెల 22వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో సర్వే చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. కల్లూరు ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓ సురేష్‌కుమార్‌లు ఈ సర్వేను పర్యవేక్షిస్తున్నారు.

ఇంటింటి సర్వే పరిశీలన

ముదిగొండ: మండలపరిధిలోని గోకినేపల్లిలో మిషన్‌భగీరథపై జరుగుతున్న ఇంటింటి సర్వేను ఎంపీఓ పెగళ్లపాటి సూర్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి మిషన్‌భగీరథ నీళ్లు అందుతున్నాయా లేదానే విషయాలపై సమగ్ర వివరాలు నమోదు చేయాలని అన్నారు. మండలంలో ఇప్పటి వరకు 10,120 ఇళ్ల వివరాల సేకరణ పూర్తయినట్లు ఎంపీఓ తెలిపారు.

7న మాదిగల ఆత్మగౌరవ కవాతు


మాట్లాడుతున్న సునీల్

మధిర: వరంగల్ జిల్లా కేంద్రంగా జూలై 7న జరగనున్న మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూరపాటి సునీల్ మాదిగ తెలిపారు. మంగళవారం మధిర పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వరంగల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30 సంవత్సరాల ఉద్యమ చరిత్రలో మాదిగ జాతి ఎన్నో ఉద్యమాలు చేసి, జాతి ఆకాంక్ష వర్గీకరణ కోసమే కాకుండా అనేక సంక్షేమ పథకాలను సాధించిన చరిత్ర మంద కృష్ణ మాదిగకే దక్కుతుందని తెలిపారు. మాదిగల ఆత్మగౌరవ కవాతులో ప్రతి మాదిగ బిడ్డ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు కనకపూడి శ్రీను మాదిగ, దాసు, రాజేష్, ఏనూక, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం


మాట్లాడుతున్న వైద్యాధికారి అవినాష్

సత్తుపల్లిరూరల్: ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ముందస్తుప్రణాళికతో నిర్వహించాలని అధికారులకు పీహెచ్‌సీ వైద్యాధికారి అవినాష్ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1–19 సంవత్సరాల పిల్లలందరికీ ఆల్‌బెండాజోల్ మాత్రలు వేయటం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లోని 21,300 మందికి ఈ మాత్రలు వేయటం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ చిన్ననాగేశ్వరరావు, ఎంపీఓ కృష్ణయ్య, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సామినేని ఫౌండేషన్ సేవలు అభినందనీయం

మధిరరూరల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న సామినేని ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం చెరుపల్లి శ్రీహరి తెలిపారు. సామినేని ఫౌండేషన్ నిర్వాహకులు సామినేని రిషి చౌదరి చేతుల మీదుగా మంగళవారం హైస్కూల్ బాలికలకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా మాటూరుపేటలో ఉన్న రెండు అంగన్‌వాడీ సెంటర్లకు రూ.40వేలు విలువచేసే ఆట వస్తువులు, కుర్చీలు, బొమ్మల మెటీరియల్స్ అందజేశారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులకు ఉన్నత చదువులపై అవగాహన కల్పించారు. సామినేని రాధమ్మ జ్ఞాపకార్థం సామినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యానగర్, హనుమాన్ కాలనీ నుంచి మాటూరు హైస్కూల్‌కు నడిచి వచ్చే బాలికలకు సుమారు లక్ష రూపాయలు విలువచేసే 15 సైకిళ్లను రిషి చౌదరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ.. ప్రతిరోజు సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ పాఠశాలకు వచ్చే బాలికల కష్టాలను తీర్చడానికి అండగా నిలిచిన ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కూడా మినరల్ వాటర్ ప్లాంట్, మాటూరు పేట నుంచి వచ్చే బాలికలకు సైకిళ్లు, క్రీడా సామగ్రిని అందజేశారని తెలిపారు.